క్లుప్తంగా

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థుల ప్రిపరేషన్‌ను పరిశీలిస్తున్న వేణుగోపాల్

మంత్రాలయం రూరల్: త్వరలో జరుగనున్న పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఏపీసీ డాక్టర్ వేణుగోపాల్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ మారుతి, సీఎంవో రాజేశ్వరి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను తనిఖీ చేశారు. డీ గ్రేడ్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. రాత్రి పూట అందుబాటులో ఉన్న విద్యార్థులు ఇంటి వద్ద ఏ విధంగా చదువుతున్నారో తల్లితండ్రుల వద్దకు వెళ్లి అడిగి తెలుసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే చిలకలడోణ గ్రామ శివారులోనున్న కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసి పది విద్యార్థుల చదువుతీరును అడిగి తెలుసుకున్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పరిమళ పాఠశాలలో ఇంటర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 226 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 216 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు.

సరిహద్దు సమస్యలకు చెక్

మంత్రాలయం రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న పొలం హద్దు వివాదాలకు పరిష్కారం లభించిందని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పి.తండా గ్రామంలో జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకం కింద రైతులకు సంబంధించిన పొలాలను రీసర్వే చేయించి హద్దు రాళ్లు ఏర్పాటు చేయించారు. డిప్యూటీ తహసీల్దార్ సరస్వతి, మండల సర్వేయర్ వాహిద్, వీఆర్వోలు ఉన్నారు.

పుష్కర ఘాట్ల వద్ద పారిశుద్ధ్య పనులు



తుంగభద్ర నదీతీరంలో స్వచ్ఛత పఖ్వాడ ప్రచార యాత్ర

మంత్రాలయం : కేంద్ర జల కమిషన్ నేతృత్వంలో శుక్రవారం స్వచ్ఛతా పఖ్వాడ కార్యక్రమం చేపట్టారు. స్వచ్ఛత ప్రచారంలో భాగంగా తుంగభద్ర నదీ తీరంలోని పుష్కర ఘాట్ల వద్ద పరిశుభ్రత పనులు చేపట్టారు. శ్రీమఠం, పంచాయతీ అధికారుల సహకారంతో నదీ తీరంలోని చెత్తాచెదారం తొలగించారు. నదీ జలాలు కలుషితం కాకూడదనే ఉద్దేశంతో సీడబ్ల్యూసీ నేతృత్వంలో స్వచ్ఛత పనులు చేపడుతున్నామని చెప్పారు. మఠం మేనేజర్ శ్రీనివాసరావు, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, సీడబ్ల్యూసీ అధికారులు పాల్గొన్నారు.

పన్ను బకాయిపై వడ్డీ మాఫీ

ఆదోనిటౌన్: ఆస్తి పన్ను బకాయిలున్న వారు ఈ నెలాఖరులోగా చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని కమిషనర్ రఘునాథరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్ను బకాయి, ఖాళీ స్థలాలకు సంబంధించిన బకాయిలను ఒకేసారి చెల్లిస్తే రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీఓ 34 విడుదల చేసిందన్నారు. పన్నులు చెల్లించాల్సిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గాయపడిన యువకుడి మృతి

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చిన్నహుల్తి – దేవనబండ గ్రామాల మధ్య గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామకృష్ణ (19) శుక్రవారం మృతి చెందాడు. పెద్దకడబూరు మండలం నెమలికల్లు గ్రామానికి చెందిన తిక్కన్న, సరస్వతి దంపతుల కుమారుడైన రామక్రిష్ణ చిన్నప్పటి నుంచి అటికెలగుండులో బంధువుల వద్ద ఉంటున్నాడు. గురువారం రాత్రి బైక్‌పై వెళ్తూ ప్రమాదానికి గురికాగా పత్తికొండ ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా అర్ధరాత్రి మార్గమధ్యలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

టి.చాకిబండలో ప్రత్యేక పూజలు

ఆలూరు: హాలహర్వి మండలం టి.చాకిబండ గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంపై ప్రధాన కలశ ప్రతిష్ఠాపన సందర్భంగా శుక్రవారం పండితులు రామనాథ్‌శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమం, మన్యు సూక్త హోమంను నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు.

‘ధర’హాసం



కళకళలాడుతున్న వరి పైరు

- పంట దిగుడులకు గిట్టుబాటు ధరలు
- ధరలపై అన్నదాతల హర్షం

మంత్రాలయం: పత్తి, వరి, మిరప, వేరుశనగ, కూరగాయలు,కనకాంబరాలు, బత్తాయి పండ్లు.. ఇలా ప్రతి పంటకు గిట్టుబాటు ధర. రైతన్నలు అ‘ధర’హో అనేంతగా దిగుబడులు రేట్లు పలుకుతున్నాయి. మూడేళ్లగా మెండైన వానలు, ఆశించిన స్థాయిలో దిగుబడులు, కష్టాలు తీరేలా పంటలకు ధరలు లభిస్తుండటంతో అన్న దాతలు ఇప్పుడిప్పుడే అప్పుల గట్టెక్కుతున్నారు. పంట ఉత్పత్తులకు సరైన ధరలు పలుకుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో 1.94 లక్షల మేర సాగు భూమి ఉంది. అత్యధికంగా 1.24 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తారు. అలాగే 12 వేల ఎకరాల్లో వేరుశనగ, 18 వేల ఎకరాల్లో మిరప, 20 వేల ఎకరాల్లో వరి పంటలు వేస్తారు. తుంగభద్ర నదీతీరంలో ఎక్కువగా వరి, ఎల్లెల్సీ, వర్షాధారం కింద పత్తి పంట పండిస్తున్నారు. బోరుబావులు, గురురాఘవేంద్ర,పులికనుమ ప్రాజెక్టులు, ఎల్లెల్సీ కింద మిరప పంట వేస్తున్నారు.

‘వరి’ంచిన ధర..

గత ప్రభుత్వాల హయాంలో క్వింటా వరి ధాన్యం రూ.1500 మించి పలికిన దాఖలాలు లేవు. ఈ ఏడాది ఖరీఫ్ కోతలు ప్రారంభం కాకముందే రూ.2వేలు పలికింది. ఇన్నేళ్లకు వరి రైతుకు సరైన ధర లభించింది. ప్రస్తుతం క్వింటా రూ.2,800 నుంచి రూ.3వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. ఆర్‌ఎస్‌ఆర్ (జిలకర సోనా), ఎన్‌డీఎల్–7 రకాలు అత్యధికంగా ధర రూ.3 వేలకు పైగా పోతుండగా కర్నూలు సోనా రూ.2,900 వరకు కొంటున్నారు.

రైతుల పాలిట వేరుశ‘నగ’..

టీడీపీ హయాంలో క్వింటా వేరుశనగ రూ.6 వేలకు మించి ధర పలుకలేదు. ప్రస్తుతం ఆది నుంచి వేరుశనగ రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా వేరుశనగ రూ.8 వేల నుంచి 9 వేల వరకు లభిస్తోంది. ఆశాజనకంగా పంటలు రావడంతో వేరుశనగ అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఎర్రటి తివాచీల్లా మిరప కల్లాలు



సిరులు కురిపిస్తున్న కనకాంబరాలు

మిరప రైతు మోము కళకళ..

గతంలో గరిష్ఠ ధర ఒక్క ఏడాది మాత్రమే మిరప రైతులకు దక్కింది. సరైన వానల్లేక, బోర్లు బావుల ఇంకిపోవడంతో అరకొరగా పంటలు చేతికొచ్చిన పరిస్థితి. ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. ఎకరాకు గరిష్ఠంగా 30 క్వింటాళ్లకు పైగా దిగుబడులు వచ్చాయి. ప్రస్తుతం మార్కెట్లో మిరప ధర రోజురోజుకు పెరిగిపోతోంది. ధర చూస్తే ఎర్రబంగారంగా రైతులు పేర్కొంటున్నారు. మొదట్లో క్వింటా మిరప రూ.18 వేల పలుకగా ప్రస్తుతం క్వింటా రూ.40 వేల వరకు విక్రయిస్తున్నారు. డబ్బి బ్యాడిగీ రకాలు క్వింటాల్ రూ.70 వేలకు పైగా పలుకుతుండటం విశేషం. ఇక సిజెంటా బ్యాడిగీ క్వింటా రూ.40 వేల వరకు, డీలక్స్ రకాలు రూ.26 వేల వరకు పోతున్నాయి. దీంతో మిరప రైతుల మోము ఆనందంతో వెల్లివిరిస్తోంది.

తెల్ల బంగారమే..

పత్తి నిజంగా రైతుల పాలిట తెల్లబంగారంగా మారింది. పత్తి క్వింటా మొదట్లో రూ.12 వేల వరకు ధర పలికింది. మొదటి పత్తి నాణ్యతగా ఉంటడంతో వ్యాపారులు ధరలు పెంచి కొన్నారు. ప్రస్తుతం నాణ్యత పరంగా కాస్త తక్కువగా ఉండటంతో ధర కూడా కొంత తగ్గింది. పత్తి సాగు పెట్టుబడుల దృష్ట్యా క్వింటా రూ.8 వేల ప్రకారం కొన్నా నష్టం ఉండదని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం క్వింటా రూ.8 వేలు నుంచి రూ.9 వేలకు కొనుగోలు చేస్తున్నారు.

పూలబాట..

పూలకు సైతం మంచి ధరలు లభిస్తున్నాయి. కోసిగి, పెద్దకడబూరు, కౌతాళం ప్రాంతాల్లో ఎక్కువగా బంతి, కనకాంబరాలు, చామంతి తోటలు సాగు చేశారు. కనకాంబరాలు కేజీ రూ.350, బంతిపూలు క్వింటా రూ.300–500, చామంతి రూ.200–300 వరకు ధర పలుకుతున్నాయి. పెట్టుబడులు తక్కువగా ఉంటడంతో పూల తోటల రైతులు మంచి ఆదాయాలు చూస్తున్నారు.

కూరగాయలు..

గతంలో కూరగాయలకు ధరల్లేక పశువులకు మేతగా వదిలిన సందర్భాలు కోకొల్లలు. ఈ ఏడాది ప్రతి కూరగాయకు మంచి ధరలు లభిస్తోంది. ప్రస్తుతం 10 కేజీల సంచి వంకాయలు రూ.400–600, బీరకాయలు మనుము రూ.500–700, మునగకాయలు క్వింటా రూ.2000 వరకు పలుకుతున్నాయి. ఇక కాకర, బెండకాయలు, టమాటా ధరలు సైతం మనుము రూ.400–650 వరకు పోతున్నాయి. ఇలా ప్రతి పంటకు గిట్టుబాటు ధరలు లభిస్తుండంపై కర్షకుల ఇళ్లలో సంతోషం నెలకొంది.

కష్టాల నుంచి కోలుకున్నాం



7 ఎకరాలకు పైగా కౌలుకు తీసుకుని వరి పంట వేశా. ఖరీఫ్‌లో ఎకరాకు 40 బస్తాల చొప్పున దిగుబడి వచ్చింది. క్వింటా రూ.2వేలకు పైగా వరి ధాన్యం విక్రయించాను. ఈసారి వరికి మంచి గిట్టుబాటు ధర లభించింది. ప్రస్తుతం కష్టాల నుంచి కోలుకున్నాం. – వెంకటేశ్వర్లు, మంత్రాలయం

పత్తి పంటకు మంచి ధర వచ్చింది



నేను 8 ఎకరాల్లో పత్తి పంట వేశా. ఎకరాకు 10 క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. మొదట్లో క్వింటా రూ.10 వేలకు విక్రయించాను. ఏటాతో పోలిస్తే ఈసారి మంచి ధర లభించింది. ఈ ఏడాది పంటలన్నింటికీ మంచి ధరలు పలుకుతున్నాయి. దీంతో రైతులంతా సంతోషంగా ఉన్నారు. – జగదీష్, కల్లుదేవకుంట

రికవరీ చేయకపోతే కఠిన చర్యలు

పెద్దకడబూరు : ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలను త్వరగా రికవరీ చేయకపోతే కఠిన చర్యలు తప్పవని ప్రాజెక్టు డైరెక్టర్ అమర్నాథ్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలో 2021 –22 లో జరిగిన ఉపాధి హామీ పనులపై శుక్రవారం ఆదోనిలో సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సామాజిక ఓపెన్ ఫోరం సమావేశం ఆదోని ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో 704 పనులను పూర్తి చేశారన్నారు. అందులో కూలీలకు రూ.542,26,477, మెటీరియల్‌కు రూ. 976,775, మొత్తం రూ. 5,52,03,252 ఖర్చు చేశారని, ఇందులో రూ. 21,810 అవకతవకలు జరిగినట్లు గుర్తించామని, వాటి రికవరీకి ఆదేశించారు. 2022–23లో ఉపాధి సిబ్బంది తమకు ఇచ్చిన టార్గెట్‌లను పూర్తి చేయాలని ఆదేశించారు. కనీసం 70శాతం పనులు పూర్తి చేయని వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో పనులను గుర్తించి పనులను కల్పించి వలసలు నివారించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ సలీంబాషా, విజిలెన్స్ ఆఫీసర్ సిద్ధలింగమూర్తి, డీవీఓ అసిస్టెంట్ పక్కీరప్ప, స్టేట్ రిసోర్స్ పర్సన్ వెంకటేష్‌నాయక్, ఏపీడీ లోకేష్, ఎంపీడీఓ వెంకటరమణప్ప, ఏపీఓ రామన్న, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



ఆదోనిలో మాట్లాడుతున్న పీడీ అమర్నాథ్‌రెడ్డి

డ్రైనేజీ పనుల పరిశీలన

ఆదోనిటౌన్: మున్సిపాలిటీలో మురికి కాల్వల ఆధునికీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. శుక్రవారం కమిషనర్ రఘునాథరెడ్డి, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, ఏఈలు, శానిటరీ సెక్షన్ అధికారులు పనులను పరిశీలించారు. 36వ వార్డు టీజీఎల్ కాలనీలో ప్రధాన మురుగు కాల్వ అయిన అవదొడ్డి వంకకు ఇంటర్ లింక్ పనులను పర్యవేక్షించారు. చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్లపై నీరు చేరి ప్రజలకు ఇబ్బందులు కలిగేవని, అయితే ఇంటర్ లింక్ వల్ల ప్రజల ఇబ్బందులు తొలగిపోనున్నాయని చెప్పారు. అనంతరం బీరప్ప కాలనీ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. పైప్‌లైన్లు, కల్వర్టులు, మురుగు కాల్వల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



టీజీఎల్ కాల్వకు ఇంటర్ లింక్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్,అధికారులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆదోనిఅర్బన్: స్థానిక ఎమ్మిగనూరు రోడ్డులో శుక్రవారం రాత్రి తండ్రీ కుమారుడు బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఇన్నోవా ఢీకొట్టడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. పట్టణంలోని తిరుమల నగర్ సమీపంలో ఉన్న తండ్రి సుభాన్, కుమారుడు సలీం పట్టణంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో తండ్రికి చికిత్స చేయించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఇన్నోవా కారు ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ వాహనాన్ని వదిలి పారిపోయాడు. అదే సమయంలో అటుగా వస్తున్న ఆదోని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిసిరా దీప్తి నిస్సహాయంగా పడిన క్షతగాత్రులను తన వాహనంలో వెంటనే స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి ఇద్దరినీ కర్నూలుకు రెఫర్ చేశారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్లతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ప్రభుత్వాసుపత్రి తనిఖీ

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిని శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి వైద్యులు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రోగుల వార్డులు, రికార్డులను పరిశీంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు తగిన వైద్య సేవలు అందుతున్నాయా? లేదా? వైద్యుల పనితీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఏమైన సమస్యలున్నా, మరమ్మతులు చేయించాలన్నా, హస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి నిధులను ఖర్చు చేసుకోవాలని తెలిపారు. నిర్మాణంలో ఉన్న వంద పడకల హాస్పిటల్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. వేసవి ఆరంభం అయ్యిందని, వడదెబ్బ, సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. రోగులకు కావలసిన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి, డాక్టర్లు, వీఆర్వో షేక్షావలి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై సత్వరం స్పందించండి

ఎమ్మిగనూరుటౌన్: సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలపై సత్వరం చర్యలు తీసుకొని వాటిని పరిష్కరించాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని 26వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టిక, మూమెంట్ రిజిష్టర్, పలు రికార్డులను పరిశీలించి ప్రజలకందిస్తున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయానికి వచ్చే ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

ఇటుక బట్టీల కాలుష్యాన్ని నివారించండి

పట్టణం, మండల పరిధిలో ఇటుకల బట్టీల ద్వారా వచ్చే కాలుష్యాన్ని నివారించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, యుఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ కోరారు.ఈ మేరకు పట్టణానికి వచ్చిన సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

మంత్రాలయం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని డివిజనల్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రభావతి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ కార్యదర్శులు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎం, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుస్థిర సర్వేలో భాగంగా గర్భిణులు, 0–5, 6–19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు అనీమియా సర్వే పూర్తి చేయాలని, అంతే కాకుండా పీఎంజేఏవై సర్వే కింద మెడికల్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షల వరకు ఉంటుందని లబ్ధిదారులను గుర్తించి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కల్యాణమస్తు, షాదీతోఫా పథకాల అమలు విధానం గురించి ప్రజలకు వివరించి దరఖాస్తు చేసుకుంటే మూడు నెలల్లోగా పారితోషకాలు జమ అవుతాయని చెప్పారు. బాల్య వివాహాలు అరికట్టడానికి ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని, అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. అంతకు ముందు గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీరాఘవేంద్రస్వామి మూలబృందావనంను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. చిలకలడోణ, కల్లుదేవకుంట, మంచాల గ్రామాల్లోని సచివాలయాలను సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ఎస్‌బీసీసీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, సీడీపీఓ నాగమణి, ఈవో నాగరాజు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న బాలకృష్ణారెడ్డి

కర్ణాటక మద్యం పట్టివేత

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని రాఘవేంద్రనగర్‌కు చెందిన చింతమాను గురురాజ, రచ్చుమర్రి గ్రామానికి చెందిన ముత్తన్న, ప్రహ్లాద ఆయా గ్రామాల్లో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు సెబ్ సీఐ జయరాం నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రూ.20 వేల విలువజేసే కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ సోమశేఖర్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ రబ్బానీ, గోపాల్, లింగప్రసాద్, చంద్రమౌళి కానిస్టేబుళ్లు నరసింహారెడ్డి,చంద్రన్న,రాధమ్మ ఉన్నారు.

భక్తులకు ఇబ్బంది కల్గిస్తే చర్యలు

మంత్రాలయం రూరల్: రాఘవేంద్రస్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు చిరు వ్యాపారులు ఇబ్బంది కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రాలయం సీఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏపీ టూరిస్టు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి మఠం ముందు భాగంలో వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా వ్యాపారం చేసుకోవాలని సూచించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ వ్యాక్సిన్

కోసిగి: మండలంలోని వివిధ గ్రామాల్లో పశువులకు వ్యాధులు సోకుండా ముందస్తుగా గాలికుంటు నివారణ టీకా వేయిస్తున్నట్లు పశువైద్యాధికారి సంతోష్ తెలిపారు. శుక్రవారం మూగలదొడ్డి, చిర్తనకల్లు గ్రామాల్లో సర్పంచ్‌లు శివలింగమ్మ, పాటిల్ ఈరన్న ఆధ్వర్యంలో పశువులకు టీకా వేశారు. ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో 200 వరకు ఆవులు, గేదెలు, ఎద్దులకు వ్యాక్సిన్ వేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గోపాల మిత్ర సత్యశేఖర్, ఏహెచ్‌ఏ భార్గవి, ఓఎస్ చాంద్‌బాషా పాల్గొన్నారు.



గో పూజలో పాల్గొన్న వివిధ మఠాల పీఠాధిపతులు

ఘనంగా గోశాల ప్రారంభం

కౌతాళం: మండలంలోని మేళిగనూరు గ్రామంలో తుంగభద్ర నది ఒడ్డున వెలసిన రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం నూతనంగా నిర్మించిన గోశాలను పాల్తూరు, మేళిగనూరు మఠం పీఠాధిపతి చిన్న వీర శివచార్య స్వామి ప్రారంభించారు. ముందుగా గ్రామస్తులు, ఆలయ ధర్మకర్త మల్లికార్జున ఆధ్వర్యంలో తుంగభద్ర నది నుంచి పవిత్ర జలాలను తీసుకొచ్చి గోశాలలో విశేషపూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించి గోశాలలోకి గోవులను తీసుకొచ్చారు. అందరూ కలిసి మెలిసి సమానమన్న భావనతో మానవత్వంతో మెలగాలని శివచార్యులు సూచించారు. వివిధ మఠాల పీఠాదిపతులు, రౌడూకుంద, హాల్వి, హచ్చోళ్లి మఠాధిపతులు, ఎంపీటీసీ లింగన్నగౌడు, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, నాయకులు రామన్నగౌడు, దేవరాజ్‌గౌడ్, పాలక్షిగౌడు పాల్గొన్నారు.

ఘనంగా మేటి కుంభోత్సవం



కోగిలతోటలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలను సన్మానిస్తున్న దృశ్యం

హొళగుంద: మండల పరిధిలోని కోగిలతోట గ్రామంలో వెలసిన సుంకలమ్మ, మారెమ్మ దేవి మేటి కుంభోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు నారాయణస్వామి తదితరులు అమ్మవార్లను దర్శించుకున్నారు. వారిని గ్రామ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి గంగి పూజ, అమ్మ వార్ల ముఖాల దర్శన కార్యక్రమం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున 3.35 గంటలకు మేటి కుంభోత్సవాల ఊరేగింపు ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా ఆలయాలలో జలాభిషేకాలు, ఆకుపూజ, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు జెడ్పీ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ, సర్పంచ్ యాట గురుపాదమ్మ తెలిపారు.

ఏకగ్రీవంగా బార్ అసోసియేషన్ ఎన్నిక

ఆదోనిరూరల్: ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక బార్ అసోసియేషన్ సమావేశ భవనంలో జనరల్ బాడీ సమావేశం శుక్రవారం జరిగింది. అధ్యక్షులుగా శ్రీమతి అనితబాయి, ఉపాధ్యక్షులుగా సావిత్రిరాణి, జనరల్ సెక్రటరీగా డాక్టర్ అంజనప్ప, జాయింట్ సెక్రటరీగా సత్యశ్రీ, ట్రెజరర్‌గా అబ్దుల్‌రహీం అన్సారి, లైబ్రేరియన్‌గా సావిత్రి, లేడీ రెప్రజెంటేటివ్ లావణ్య, తదితరులను సభ్యులుగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున

వెలుగు సీసీ, బుక్ కీపర్లపై విచారణ

ఆదోనిరూరల్: మండలంలోని పెద్ద తుమ్మలం గ్రామంలో జరిగిన వెలుగుసీసీ, బుక్‌కీపర్ల బాగోతంపై శుక్రవారం వెలుగు అధికారులు విచారణ చేపట్టారు.ఏపీఎం జనార్ధన్‌తో పాటు మిగతా అధికారులు స్త్రీనిధి, బుక్‌కీపర్లు అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. సీసీ రామన్న, బుక్ కీపర్లు చేసిన అవినీతిపై నివేదికను తయారు చేసినట్లు ఏపీఎం తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపి చర్యలకు సిఫారసు చేస్తామని చెప్పారు.



విచారణ జరుపుతున్న అధికారులు